సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 19 । మార్చి । 2024



హత్య కేసులో కూతురే సూత్రధారి

తన కూతురి వివాహేతర సంబంధాన్ని పసిగట్టిన తండ్రి కూతురిని పలుమార్లు మందలించాడు. దీంతో ఆ కూతురు తండ్రిపై కక్ష పెంచుకుని ప్రియుడి చేత చంపించింది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాయచోటి :	6.30	5.04
రాజంపేట :	6.30	5.02
పీలేరు :	6.32	5.00
మదనపల్లె :	6.32	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 22 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	336	380
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 774.300 కిలోలు

న్యూస్‌రీల్

ఆధార్ సీడింగ్ తప్పనిసరి

రాయచోటి టౌన్ : నేషనల్‌ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్-కం- మెరిట్ స్కాలర్ షిప్) పరీక్షలలో ఎంపికైన (9,10,11,12 తరగతులు చదువుతున్న) విద్యార్థులు నేషనల్ స్కాలషిప్ పోర్టల్ నమోదు/ రెన్యువల్ చేసుకున్న విద్యార్థులు తమ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక అయిన విద్యార్థి తమ ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డు,ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్‌బుక్ సంబంధించిన బ్యాంక్‌కు వెళ్లి ఆధార్ సీడింగ్ చేసుకోవాలని వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా అప్పుడప్పుడు స్కాలర్‌షిప్ స్టేటస్ విద్యార్థి లాగిన్ తనిఖీ చేసుకోవాలని కోరారు. దీనికి ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

రాయచోటి : కొత్తగా నమోదు, సవరణ చేసిన ఓటర్లకు ఎన్నికల కమీషన్ అనుమతితో కార్డులను పంపిణీ చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరసింహ కుమార్ తెలిపారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశానుసారం సవరణ, కొత్తవి కలిపి 1,63,000 కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 20వ తేది నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ వరకు 1,63,000 మంది ఓటర్లకు గుర్తింపు కార్డులు సిద్ధం చేసినట్లు వారు వెల్లడించారు. ఈ గుర్తింపు కార్డులను ఇంటి చిరునామా ప్రకారం అందజేశామని, మిగిలిన కార్డులను కూడా సిద్ధం చేసి పోస్టల్ ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదిలోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని నరసింహ కుమార్ తెలిపారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ చేశారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో వీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రంగురంగులపూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అంద చేశారు.

ఖైదీ విద్యార్థులకు పరీక్షలు

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పాఠశాల, కళాశాల (దూరవిద్య ద్వారా) వైఎస్‌ఆర్ జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో కడప కేంద్రకారాగారంలో ఖైదీ విద్యార్థులకు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. 10వ తరగతికి సంబంధించి 52 మంది, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 19 మంది ఖైదీలు పరీక్షలకు హాజరవుతున్నారని కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్ ప్రకాష్ తెలియజేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

– ఇద్దరిపై ఎఫ్‌ఐఆర్

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు -2024కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 16న షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ)అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కాగా ఆదివారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో దూదేకుల సంఘం తరపున మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. ఆ కార్యక్రమం నిర్వహించుకునేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం సీరియస్‌గా స్పందించి విచారణ నిర్వహించిందన్నారు.


ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన పగిడాల దస్తగిరి, సి.నాగూర్‌లపై ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్, ఆర్‌ఓల ఫిర్యాదుల మేరకు టు టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చక్కటి రాత..
మార్కుల మోత

- మెలకువలతో పది ఉత్తమ గ్రేడ్
- అక్షర దోషాలు, దిద్దుబాటు ఉండకూడదు
- విద్యార్థులకు నిపుణుల సూచనలు



పరీక్షకు హాజరైన విద్యార్థులు



కడప ఎడ్యుకేషన్/మదనపల్లె సిటీ : పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పదింతల ఉత్సాహంతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మార్కుల సాధనకు చదవడం ఎంత ముఖ్యమో చక్కటి చేతిరాత కీలకం. సరైన సమాధానం రాసినా... పేపరు దిద్దేవారికి అర్థమైనప్పుడే నూరు శాతం మార్కులు సాధించవచ్చని గతంలో పరీక్ష పత్రాలను దిద్దిన ఉపాధ్యాయులు చెబుతున్నారు.పెన్‌టిప్‌ను దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు గుండ్రంగా వస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

సూచనలు..

- జవాబులను సూటిగా రాయాలి
- మనం రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దేవారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు
- వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి
- చేతి రాత గుండ్రంగా ఉండటంతోపాటు అర్థమయ్యేలా ఉండాలి

అక్షరం బాగుంటే విజయం మీదే..

విద్యార్థి చేతి రాతను బట్టి సబ్జెక్టులో అతని అవగాహన స్థాయిని అంచనా వేయవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారనేది జవాబు పత్రాలు దిద్దేవారికి తెలియదు. వారు రాసే తీరు అక్షరాల కూర్పును బట్టి వారి ప్రతిభను అంచానా వేస్తారు.అందమైన దస్తూరి చూసే వారిని ఇట్టే అకట్టుకుంటుంది. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారి మనసుకు హత్తుకుని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది.

ఇలా రాస్తే మంచిది..

- ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయాలి.
- సమాధానపత్రంలో పేజీకి 15- 16 లైన్లు ఉండాలి.
- పేజీకి పైన కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి వరుసలో ఎంత బాగా రాశారో చివరి వరకు అదే దస్తూరి కొనసాగించాలి
- గణితంలో అయితే అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గుతాయి. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి.
- సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి,
- సాంఘికశాస్త్రం సబ్జెక్టులో సమాధానాలను పాయింట్ల వారీగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా ఉర్తించాలి. శీర్షికలు, ఉపశీర్షికలు కింద అండర్‌లైన్ వేయాలి.
- మంచి పెన్నులను ఉపయోగించాలి. అక్షరాలు గుండ్రంగా ఉండేలా చూసుకోవాలి

విద్యార్థులు చేసే పొరపాట్లు..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా ఉంటే జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16–18 లైన్లకు మించకుండా చూడాలి. లైన్లు సమాంతరగా ఉండాలి.పదాలు ఒకేలైన్‌లో వచ్చేలా రాయాలి. చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబుపత్రం గజిబిజిగా తయారవుతుంది.చాలా మంది అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లీషు జెడ్ తరహాలో, 5ను ఎస్ తరహాలో, 0 ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి.

మూల్యాంకనంలో ప్రాధాన్యం...



మంచి దస్తూరికి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. కొట్టివేతలు లేకుండా రాయాలి. అలాగని దస్తూరి సరిగ్గా లేని వారు ఆందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. ఉన్నంతలో మెరుగ్గా రాసేందుకు ప్రయత్నం చేయాలి. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి.

అదనపు మార్కులకు అవకాశం..



అందమైన దస్తూరి మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది బాగా చదువుతారు. అయితే అక్షరాలు సరిగా రాయకపోవడంతో అనుకున్న మార్కులను సాధించలేకపోతున్నారు. అందువల్ల చిన్న వయసు నుంచే దస్తూరిపై దృష్టి సారిస్తే మంచిది. విద్యార్థుల తల్లితండ్రులు కూడా పిల్లల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. పరీక్షలలో ఉత్తీర్ణులయ్యే విధంగా చొరవ తీసుకోవాలి. – మర్రెడ్డి అనురాధ, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

చేతి రాత ఓ ఆయుధం



మంచి ఫలితాల సాధనకు చక్కటి అక్షరమాల ఓ ఆయుధం. పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు గుండ్రని చేతిరాతపై పట్టు సాధించాలి. అక్షరదోషాలు లేకుండా గుండ్రంగా ,వాక్యాల నడుమ నిడివితో రాసేలా తర్ఫీదు పొందాలి. – పురుషోత్తం, డివైఈఓ,మదనపల్లె.

తొలిరోజు పదిలం



రాజంపేటలో పరీక్షరాస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్) లక్కిరెడ్డిపల్లెలో పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న విద్యార్థులు

- తొలిరోజు 962 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈఓ

రాయచోటి : సోమవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 129 కేంద్రాలలో 23,536 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22574 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష రాసేందుకు అనుమతించారు. ఈ పరీక్షలను సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి పర్యవేక్షించారు. పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు.....

పదోతరగతి పరీక్షలు మొదటి రోజున ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు రాశారని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 129 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా 5353 కేంద్రాలలో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు తాను పరిశీలించామన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని మౌళిక వసతులను కల్పించామన్నారు. ఒకటి రెండు కేంద్రాలలో ఒకరు, ఇద్దరు మినహా మిగిలిన విద్యార్థులు అందరూ పరీక్ష హాల్‌కు ముందుగానే చేరుకున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఓపెన్ స్కూల్ పరీక్షలను కూడా పర్యవేక్షించామని డీఈఓ తెలిపారు.



రాజంపేటలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద నంబర్లు సరి చూసుకుంటున్న విద్యార్థినులు



మదనపల్లెలో పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లపై విద్యాశాఖ అధికారుల చర్చలు

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోండి

- ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసుల కవాతు
- ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: కలెక్టర్ , ఎస్పీ



పోలీసు కవాతులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు



ఈవీఎం గోడౌన్ పరిశీలనలో రాజకీయ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి : అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ బి.క్రిష్ణారావు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ప్రధాన రహదారులపై కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసుల కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజలలో భరోసా కల్పించి, అల్లర్లు జరగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసులు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. నిర్భయంగా ప్రజలందరూ వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందుగా జిల్లా అడిషనల్‌ఎస్పీ రాజ్‌కమల్, ప్రత్యేక సాయుధదళంతో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, రాయచోటి పట్టణ, రూరల్ సీఐలు కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు.

ఈవీఎం గోడౌన్‌లపై నిరంతర నిఘా

ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఎస్పీ కృష్ణారావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లాకు మొత్తం 4893 బీయులు, 4220 సీయూలు, 4847 వీవీ ప్యాట్‌లు వచ్చాయని, వీటన్నింటినీ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈవీఎం యంత్రాలు బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను అక్కడి భద్రతా చర్యలు చాలా పకడ్బందీగా ఉండాలని గోడౌన్ లోపల, బయట సీసీ కెమెరాల నిఘా నిరంతరాయంగా ఉండాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కగా ఉండాలి

పీలేరు : జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కగా ఉండాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. సోమవారం ఎస్పీ కృష్ణారావుతో కలసి కలెక్టర్ పీలేరు పట్టణంలోని మార్కెట్‌యార్డు, ఎస్‌జీ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు.

టీడీపీకి గట్టి షాక్

– నేడు వైఎస్సార్‌సీపీలోకి రెడ్యం

ఖాజీపేట : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కడప రీజినల్ మాజీ ఆర్టీసీ డైరెక్టర్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీలో చేరనున్నారు. మైదుకూరులోని డీసీఎల్ కల్యాణ మండపంలో 19వ తేదీ సాయంత్రం 4 గంటలకు చేరనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్, జిల్లా పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జి సురేష్‌బాబు హాజరు అవుతున్నట్లు రెడ్యం సోదరులు తెల్పారు. ఖాజీపేట మండలంలో 1983 నుంచి టీడీపీ కోసం రెడ్యం సోదరులు పనిచేశారు. పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారు. వీరు వైఎస్సార్ సీపీ లోకి చేరుతుండటంతో టీడీపీకి గట్టి షాక్ అని చెప్పవచ్చు. రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తోపాటు వారి సోదరులు కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు రెండ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం ఆదినారాయణరెడ్డి, రెడ్యం రామకృష్ణారెడ్డితో పాటు పలువురు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్యం తోపాటు పార్టీలో చేరనున్నారు.

నిష్పాక్షిక ఎన్నికలకు ఎంసీసీ

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన క్షణం నుంచే దేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులోకి వచ్చింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు వీలుగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉపయోగపడుతుంది. అభ్యర్థులు, అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల సమయంలో ఎలా నడుచుకోవాలో ఎన్నికల కమిషన్ ఎంసీసీ ద్వారా వివరిస్తుంది. కాగా ఈ ఎన్నికల్లో తొలిసారిగా కోడ్ ఉల్లంఘించిన ప్రొద్దుటూరు(వైఎస్సార్ జిల్లా) కు చెందిన ఇద్దరిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అసలు ఈ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అంటే ఏమిటో తెలుసుకుందాం.. – కడప సెవెన్‌రోడ్స్

పార్టీలు, అభ్యర్థుల కోసం

పార్లమెంట్, సాధారణ ఎన్నికలు–2024 కు సంబంధించి ప్రకటన విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కమిషన్ రూపొందించిన మార్గదర్శకాల (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఎన్నికల ప్రకటనకు ముందే క్షేత్రస్థాయిలో వాస్తవంగా ప్రారంభించిన కార్యక్రమాలు కొనసాగించవచ్చు.
- వరదలు, కరువు, తెగుళ్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లోని ప్రజలకు ఉపశమనం, పునరావాస చర్యలు ప్రారంభించవచ్చు, వాటిని కొనసాగించవచ్చు.
- మైదానాల వంటి బహిరంగ స్థలాలు ఎన్నికల సమావేశాలను నిర్వహించడానికి అన్ని పార్టీలు/పోటీ చేసే అభ్యర్థులకు అందుబాటులో ఉండాలి. హెలిప్యాడ్‌ల ఉపయోగం కూడా అన్ని పార్టీలు/పోటీ చేసే అభ్యర్థులకు అందుబాటులో ఉండాలి.
- శాంతియుతమైన, ఇబ్బంది లేని ఓటు వినియోగం కోసం ప్రతి వ్యక్తి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చూడాలి.
- రాజకీయ పార్టీలు ప్రతిపాదిత సమావేశాల వేదిక, సమావేశ సమయానికి సంబంధించి స్థానిక పోలీసు అధికారులకు ముందస్తుగా తెలియజేసి అనుమతులు తీసుకోవాలి.
- ఏదైనా సమావేశం జరిగే ప్రదేశంలో నిర్బంధ లేదా నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటే, వాటిని పూర్తిగా పరిగణలోకి తీసుకుని అందుకు తగిన మినహాయింపులు, ముందస్తు అనుమతులు పొందాలి.
- పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి సమావేశాల కోసం ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల మధ్య లౌడ్‌స్పీకర్‌ల వినియోగానికి, ఇతర సౌకర్యాల కోసం పోలీసు లేదా సంబంధిత అధికారుల నుండి అనుమతి పొందాలి.
- సమావేశాలకు భంగం కలిగించే వ్యక్తులతో లేదా అశాంతి సృష్టించే వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు పోలీసుల సహాయాన్ని పొందాలి.
- ఏదైనా రహదారిపై ఊరేగింపు, ప్రచార ర్యాలీ ప్రదేశాలకు సంబంధించి. ముందుగానే పోలీసు/సంబంధిత అధికారుల నుంచిఅనుమతులు పొందాలి.
- ఊరేగింపు, ర్యాలీ నిర్వహణ సమయంలో పబ్లిక్ ప్రయాణానికి ఎలాంటి అంతరాయం లేకుండా ఉండాలి.
- శాంతియుతంగా, క్రమబద్ధంగా పోలింగ్ జరిగేందుకు.. అన్ని సమయాల్లో ఎన్నికల అధికారులందరికీ సహకరించాలి.
- ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది మొత్తం తప్పనిసరిగా బ్యాడ్జ్‌లు లేదా గుర్తింపు కార్డులను ధరించాలి.
- ఓటర్లకు జారీ చేసిన గుర్తింపు స్లిప్పులు సాదా (తెలుపు) కాగితంపై ఉండాలి. అలాగే సంబంధిత పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు లేదా పార్టీ పేరును కలిగి ఉండరాదు.
- ప్రచార సమయంలో, పోలింగ్ నిర్వహణ రోజున వాహనాల రాకపోకలపై నిబంధనలు, పరిమితులు పాటింపులో ఉండాలి.
- ఓటర్లు, అభ్యర్థులు.. వారి ఎన్నికల/పోలింగ్ ఏజెంట్లు మినహా..., ఎన్నికల సంఘం నుంచి నిర్దిష్ట చెల్లుబాటు అయ్యే అధికార సిఫార్సు లేఖ ఉన్న వ్యక్తులను మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తారు. ఈ షరతుల నుంచి ఉన్నత స్థానంలో ఉన్న ఏ ప్రతినిధికి (ఉదా. ముఖ్యమంత్రి, మంత్రి, ఎంపీ లేదా ఎమ్మెల్యే మొదలైనవి) మినహాయింపు లేదు.

చేయకూడనివి

- ఎంసీసీ వ్యవధి అమలులోకి రాక ముందే వర్క్ ఆర్డర్‌లు జారీ చేసిన వాటికి సంబంధించి ఏ పనిని ప్రారంభించకూడదు.
- రోడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం మొదలైన పనులకు సంబంధించి.. మంత్రులు, ఇతర అధికారులు ఎటువంటి ఆర్థిక గ్రాంట్లు లేదా వాగ్దానాలను ప్రకటించకూడదు.
- మంత్రులు / ఇతర అధికారులు (సివిల్ సర్వెంట్లు తప్ప) కొత్త ప్రాజెక్టులు / పథకాలకు పునాది రాళ్లు వేయకూడదు.
- అధికారంలో ఉన్న పార్టీ సాధించిన విజయాల గురించి ప్రభుత్వ ఖజానా ఖర్చుతో.. ప్రకటనలు చేయడం నిషేధం.
- ఏ మంత్రి కూడా అతను/ఆమె అభ్యర్థి లేదా ఓటరుగా ఓటు వేయడానికి తప్ప, ఏ పోలింగ్ స్టేషన్ లేదా కౌంటింగ్ ప్రదేశంలోకి ప్రవేశించకూడదు.
- ఎలాంటి అధికారిక పనిని.. ఎన్నికల ప్రచారంతో కలపకూడదు.
- ఓటరుకు ఎలాంటి ఆర్థికపరమైన ఆఫర్లు చేయరాదు.
- వివిధ కులాలు, వర్గాలు లేదా మత లేదా భాషా సమూహాల మధ్య ఇప్పటికే ఉన్న విభేదాలను తీవ్రతరం చేసేలా (లేదా) పరస్పర ద్వేషాన్ని సృష్టించేలా (లేదా) ఉద్రిక్తత కలిగించే ఏ కార్యాచరణకు ప్రయత్నించకూడదు.
- ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల బహిరంగ కార్యకలాపాలతో, సంబంధం లేని వారి వ్యక్తిగత జీవితంలోని ఏ అంశాన్ని విమర్శించడానికి అనుమతి లేదు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా ఏదైనా ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించకూడదు. ఈ ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, అతికించడం, సంగీతాన్ని ప్లే చేయడం నిషేధం
- అవినీతి మార్గాలు లేదా ఎన్నికలకు సంబంధించి లంచం, ఓటర్లంజ్ మభ్యపెట్టే చర్యలు, ఓటర్లను బెదిరించడం, ప్రచారం చేయడం వంటివి పోలింగ్ స్టేషన్ కు 100 మీటర్ల పరిధిలో నిషేధించారు.
- పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన 48 గంటల ముగిసే వ్యవధిలో... బహిరంగ సభలను నిర్వహించడం మరియు ఓటర్లు పోలింగ్ స్టేషన్‌ల బయటికి, లోనికి తిరగడం నిషేధం.
- అభ్యర్థులు/ఓటర్ల అభిప్రాయానికి లేదా కార్యకలాపాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే విధంగా వ్యక్తుల ఇళ్ల ముందు ప్రదర్శనలు లేదా పికెటింగ్‌లను ఆశ్రయించకూడదు.
- స్థానిక చట్టాలకు లోబడి, యజమాని నిర్దిష్ట అనుమతి లేకుండా జెండా కర్రలు కట్టడం, బ్యానర్లు పెట్టడం, నోటీసులు అతికించడం లేదా నినాదాలు రాయడం మొదలైనవాటికి ఏ వ్యక్తి భూమి, భవనం, కాంపౌండ్ వాల్, వాహనాలను ఎవరూ ఉపయోగించరాదు. (జిల్లా ఎన్నికల అధికారికి చూపించి, డిపాజిట్ చేయాలి).
- మరొక పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్న ప్రదేశాల వెంట ఊరేగింపులు చేపట్టకూడదు.
- ఊరేగింపులలో ఆయుధాలు, క్షిపణులుగా దుర్వినియోగం చేయగల వస్తువులను కలిగి ఉండకూడదు.
- పోలింగ్ రోజున, గుర్తింపు స్లిప్పుల పంపిణీకి ఉపయోగించే స్థలంలో లేదా పోలింగ్ స్టేషన్లలో 100 మీటర్ల వ్యాసార్థంలో పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు లేదా ఇతర ప్రచార సామగ్రిని ప్రదర్శించకూడదు.
- కదిలే వాహనాలపై అమర్చిన లౌడ్ స్పీకర్లను సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా.. ఉదయం 6 గంటలకు ముందు. రాత్రి 10 గంటల తర్వాత ఉపయోగించరాదు.
- రాత్రి 10 గంటలు దాటాక బహిరంగ స భ లు/ ఊరేగింపులు కొనసాగించడానికి అనుమతి ఉండదు..
- ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఎక్కడ కూడా మద్యం పంపిణీ చేయరాదు.
- పోలింగ్ రోజున, భద్రతాపరమైన ముప్పు ఉన్నట్లు ఉన్నా.. అధికారిక భద్రత కల్పించిన ఏ వ్యక్తి కూడా తన భద్రతా సిబ్బందితో పోలింగ్ స్టేషన్ ప్రాంగణం (100 మీటర్ల వ్యాసార్థంలో) సమీపంలోకి ప్రవేశించకూడదు.

12 మంది జూదరుల అరెస్టు

రూ.31,060 నగదు స్వాధీనం

మదనపల్లె : జూదం ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని నీరుగట్టువారి పల్లె, రామిరెడ్డిలేఔట్ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో వేర్వేరు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. మొదట జరిపిన దాడిలో పట్టణానికి చెందిన పి.వెంకటాద్రి (46), జి. వినయ్ కుమార్(30), ఎం.చంద్రశేఖర్ (31)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,430 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా రామిరెడ్డి లేఔట్‌లోని మరో ప్రాంతంలో దాడి చేసి పట్టణానికి చెందిన ఎం.సోమశేఖర్ రెడ్డి(40) ఎం.సత్యనారాయణ(50) బి.వెంకటేష్(60) వై.శివకుమార్ రెడ్డి(39) డి.రెడ్డప్ప(50) కె.హరినాథ్(39) ఎస్. ప్రసాద్(52) పి.రామచంద్ర(50) ఈ. మనోహర (50)లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.27,630 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పుంగనూరు రోడ్డులోని 150 వ మైలు వద్ద నివాసం ఉన్న డ్రైవర్ శ్రీనివాసులు (36), ఆటో తోలుకుంటూ జీవిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకునేందుకు వచ్చాడు. తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని బసినికొండ ఆర్చి వద్ద ఉన్నట్టుండి కళ్లు తిరగడంతో, ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడిన శ్రీనివాసులును స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో కన్న కూతురే సూత్రధారి

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని హత్య
- ప్రియుడితో కలిసి గడ్డపారతో హత్యచేయించిన వైనం
- వివరాలు వెల్లడించిన ట్రైనీ డీఎస్పీ జీఎస్ ప్రశాంత్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ, ఎస్ఐ



నిందితురాలు బ్రాహ్మణి

ములకలచెరువు : తన కూతురికి వివాహమైంది. అయినా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఉంది. ఈ విషయాన్ని పసిగట్టిన తండ్రి కూతురిని పలుమార్లు మందలించాడు. దీంతో ఆ కూతురు తండ్రిపై కక్ష పెంచుకుంది. తమ వివాహేతర సంబంధం ఇలాగే కొనసాగాలంటే అడ్డుగా ఉన్న తండ్రిని ఎలాగైనా హత మార్చాలని పథకం పన్నింది. ఎట్టకేలకు ముందుగా రచించిన పథకం ప్రకారం కోళ్లఫారం షెడ్డులో ఒంటరిగా నిద్రిస్తున్న తండ్రిని కన్న కూతురే ప్రియుడి చేత చంపించింది. ఈ విషయం పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ట్రైనీ డీఎస్పీ జీఎస్ ప్రశాంత్, ఎస్ఐ తిప్పేస్వామిలు సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్ద మొరవపల్లికి చెందిన దయ్యాల రాజారెడ్డి (55) ఈ నెల 12న కోళ్లఫారం షెడ్డులో దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడి అల్లుడు వడిగల బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పలు కోణాల్లో విచారణ చేపట్టారు. మృతుడి పెద్ద కుమార్తె బ్రాహ్మణి తంబళ్లపల్లి మండలం గుండ్లపల్లి పంచాయతీ అనగలవారిపల్లికి చెందిన రామిశెట్టి మల్లికార్జున కుమారుడు అరుణ్‌కుమార్ (29)తో 2019 నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఉండేది. అంతేగాక ఇంట్లో ఉన్న బంగారు నగలను సైతం ఇంట్లో వారికి తెలియకుండా విక్రయించి గుట్టుగా రూ.10 లక్షల నగదును ప్రియుడికి ఇచ్చింది. అంతేగాక మదనపల్లిలో ఉన్న ఇంటి స్థలాన్ని కూడా కుదువ పెట్టి అదనంగా రూ.40 లక్షల నగదు ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని పసిగట్టిన తండ్రి రాజారెడ్డి కూతురిని నిలదీసి బంగారు నగలు ఏం చేశావ్, ఎక్కడున్నాయో వాటిని తెచ్చి పెట్టు అని ప్రశ్నించడంతో పాటు కూతురిపై చేయి చేసుకున్నాడు. మళ్లీ ఇలాంటి నీచమైన పనులు చేస్తే కన్న కూతురు అని కూడా చూడను, నిన్ను అరుణ్‌ను వదలను అని గట్టిగా హెచ్చరించాడు. దీంతో తండ్రిపై విపరీతమైన కక్ష పెంచుకుంది. తన వివాహేతర సంబంధం ఇలాగే కొనసాగాలంటే అడ్డుగా ఉన్న తండ్రిని ఎలాగైనా వదిలించుకోవాలని ప్రియుడితో కలసి పథకం రచించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12న అర్ధరాత్రి వరకు కూతురు, అల్లుడు, తండ్రి కలసి కోళ్లను వాహనంలో తరలించేశారు. అనంతరం కోళ్లఫారం షెడ్డు వద్ద తండ్రి అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. అక్కడే ఉన్న తన భర్త బాలాజీని వెంట బెట్టుకుని బ్రాహ్మణి పెద్దమొరవపల్లికి వచ్చేసింది. అనంతరం కోళ్ల షెడ్డులో తన తండ్రి ఒంటరిగా ఉన్నాడని పక్కనే ఉన్న గడ్డపారతో హత మార్చాలని ఫోన్‌లో ప్రియుడికి సూచించింది. దీంతో అప్పటికే చెట్ల చాటున కాపు కాసిన ప్రియుడు అరుణ్‌కుమార్ గడ్డపారతో నిద్రిస్తున్న రాజారెడ్డిని హతమార్చి ఈ విషయాన్ని బ్రాహ్మణికి ఫోన్‌లో చెప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టి హత్యకు కారకుడైన అరుణ్‌కుమార్ (29)ను వేపూరికోట పంచాయతీ బత్తలాపురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. అలాగే హత్యకు పథకం రచించిన బ్రాహ్మణిని వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన గడ్డపార, ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు పంపామని ట్రైనీ డీఎస్పీ పేర్కొన్నారు.



నిందితుడు అరుణ్‌కుమార్

రూ. 18 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

కారుసహా ఇద్దరు నిందితుల అరెస్టు



కారు, ఎర్రచందనం తోపాటు నిందితులను అరెస్టు చేసిన ఫారెస్ట్ అధికారులు

పీలేరు : రూ. 18 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకుని కారుతోసహా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పీలేరు ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. సుండుపల్లె ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ఫారెస్ట్ అధికారులు పులిచెర్ల మండలం కల్లూరు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున పీలేరు వైపు నుంచి చిత్తూరు వైపు అతివేగంగా వెళుతున్న కారును గుర్తించి సిబ్బంది వెంబడించారు. కొమ్మిరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద కారును ఆపి పారిపోయే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు తిరుపత్తూరుకు చెందిన జయవేల్, కిలక్‌కాడుకు చెందిన మురుగన్‌లను అరెస్టు చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. 364 కేజీల బరువుగల ఎర్రచందనం దుంగల తోపాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడిలో ఎఫ్ఓ ఎన్. వెంకటరమణ, సిబ్బంది ప్రతాప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ యువరాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య

మదనపల్లె : అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ములకలచెరువు మండలం గుడిపల్లి పంచాయతీ చెరువు కింద పల్లెకు చెందిన సుధాకర్ కుమారుడు ఆకుల మణి (19), మదనపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. చదువులో వెనుక పడుతూ ఉండడంతో తండ్రి ఇటీవల మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి 16వ తేదీ హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పలుచోట్ల ఆచూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో 17వ తేదీ ఆదివారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థి మణి కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ విశ్వం కాలేజీ వద్ద, ప్రైవేట్ నర్సరీ సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సమాచారం అందుకున్న తండ్రి సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థిని ఆదివారం రాత్రి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. టూ టౌన్ సీఐ యువరాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆసుపత్రికి చేరుకొని విద్యార్థి పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన కారణంగానే ఈ చర్యకు పాల్పడినట్లు తెలిసింది.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం రాజీవ్‌నగర్‌లో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న దువ్వూరు మండలానికి చెందిన టంగుటూరు మల్లికార్జునను కడప వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్



కొత్త ఇండ్లు పంచాయతీలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలను ఆహ్వానిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని కొత్త ఇండ్లు పంచాయతీలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సచివాలయ కన్వీనర్ హబీబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మైనారిటీ నాయకులు ముబషీర్, గుండ్లూరుఫీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనను మెచ్చి పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు వస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ చూసి, ఆయనను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. మత,కుల అజెండాలతో ప్రజలను ఏమార్చేందుకు ప్రయతిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లు కొనసాగిన సంక్షేమ పాలన కలకాలం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో రవి, మోహన, సురేష్, లక్ష్మీదేవి, శంకరమ్మ, భాస్కర తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రెడ్డెమ్మ, అమీరున్నీసా, బస్రి, సర్పంచ్ ఆసియాబేగం, ఇర్ఫాన్, మహేష్ రాటకొండ నవీన్, బాబాజాన్, హరి, కిజర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి




ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోవడంతో మృతి చెందిన డ్రైవర్ రెడ్డెయ్య

ఓబులవారిపల్లె : గాదెల కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో డి. రెడ్డెయ్య(30) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు రెడ్డెయ్య కమలాపురం మండలం, చిన్న చెప్పలి గ్రామానికి చెందిన వాడు. గాదెల వెంకటాపురం గ్రామంలో శివ ఇటుకల బట్టీల వద్ద ఏడాది నుంచి పనిచేస్తున్నాడు. ఇటుకలను మండల కేంద్రానికి ట్రాక్టర్ ద్వారా తరలించి తిరిగి వెంకటాపురం గ్రామానికి వస్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ మలుపు సమీపంలో వేగంగా రావడంతో ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో డ్రైవర్ సీటు నుంచి రెడ్డెయ్య దూకడంతో టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య యానాదమ్మ, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరుకు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

'ఆరోగ్య శ్రీ' ద్వారా చిన్నారులకు మాటలు, వినికిడి శక్తి

కడప రూరల్ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ' ద్వారా పేదలు ఖరీదైన జబ్బులకు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. తద్వారా పునర్జన్మ పొందుతున్నారు. ప్రధానంగా పుట్టుకతోనే చెవుడు, మూగ చిన్నారులు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. తద్వారా ఆ పిల్లలు వింటున్నారు..మాట్లాడగలుగుతున్నారు. ఇందుకు సంబంధించిన సర్జరీ కడప నగరంలోని తిరుమల ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులకు విజయవంతంగా నిర్వహించడం విశేషం. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ సురేంద్రబాబు సోమవారం విలేకరుల సమావేశంలో వివరించారు. పుల్లంపేటకు చెందిన ఎస్.అబ్దుల్ వహాబ్, రేష్మా దంపతుల మూడేళ్ల కుమారుడు అబ్దుల్ హబీబ్‌కు రెండు చెవులకు ఒకేసారి బైనారల్ కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీ చేశామన్నారు. అలాగే రామాపురం మండలం సరస్వతీపేట ఎస్సీ కాలనీకి చెందిన రెడ్డెయ్య, నిర్మల దంపతులకు చెందిన నాలుగేళ్ల కుమార్తె ప్రవల్లికకు ఒక చెవికి కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్జరీలో అనస్తీషియా స్పెషలిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇలా ఇద్దరు చిన్నారులకు రాష్ట్రంలోనే మొదటి సారిగా తమ ఆసుపత్రిలో సర్జరీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఈ ఇద్దరు పిల్లలు అందరిలా వినగలరు.. మాట్లాడగలరని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఏఓ తేజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ఉమాదేవి (ఫైల్)

పెనుకొండ రూరల్ : డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన మురళి, ఉమాదేవి (34) దంపతులు బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. బెంగళూరులోనే స్థిరపడిన వీరు.. తమ ఇద్దరు పిల్లలతో కలసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఆదివారం రాత్రి కారులో బెంగళూరుకు బయలుదేరారు, సోమవారం ఉదయం పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గుట్టూరు వై.జంక్షన్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొని రెండు ముక్కలైంది. ఘటనలో ఉమాదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలుతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పెనుకొండ ఎస్ఐ రంగడు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఖాజీపేట : విద్యుత్ షాక్ తగిలి చాట్ల ఓబులేసు(49) అనే వ్యక్తి మృతి చెందాడు. సుంకేసుల దళితవాడకు చెందిన ఓబులేసు ఇంటిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి వచ్చిన వెంటనే టేబుల్ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేయబోయాడు. షాక్ తగిలి కింద పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం. ఖాజీపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కుక్కల దాడిలో పొడదుప్పికి గాయాలు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ అబ్బుసాహెబ్‌పేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం కుక్కలు దాడి చేయడంతో ఓ పొడదుప్పి తీవ్ర గాయాలపాలైంది. తీవ్ర గాయాలతో గ్రామ సమీపంలోని ఓ రైతు పొలం వద్దకు చేరుకున్న పొడదుప్పిని స్థానికులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ శేషయ్య ఆదేశాల మేరకు సిబ్బంది అక్కడికి చేరుకుని దుప్పికి పట్టణంలోని పశువైద్యశాలలో చికిత్స అందించి అనంతరం వల్లెరవారిపల్లె బీట్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

అరటి కాయల జీపు బోల్తా

పులివెందుల రూరల్ : వేముల మండల పరిధిలోని కనంపల్లె గ్రామ సమీపంలో నామాలగుండు వద్ద అరటికాయల జీపు బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామాల నుంచి తోటల వద్దకు వెళ్లి అరటికాయలు లోడ్ చేసుకుని తిరిగి కదిరి, మదనపల్లెకు వెళుతుండగా అదుపుతప్పి నామాలగుండు బ్రిడ్జి వద్ద జీపు బోల్తా పడింది. జీపులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌కు గానీ, మరో వ్యక్తికి గాని ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో ఉన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బైకును ఢీకొన్న కారు

వేంపల్లె : స్థానిక పాములూరు గ్రామ సమీపంలోని గుట్ట వద్ద బైకును కారు ఢీకొట్టింది. దీంతో సుబ్బరామిరెడ్డి అనే వ్యక్తికి తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వీరపునాయునిపల్లె మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బరామిరెడ్డి తన అవసర నిమిత్తమై ఓబుల్‌రెడ్డిపల్లి నుంచి వేంపల్లెకు వస్తుండగా పాములూరుగుట్ట వద్ద వేంపల్లె పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రామకృష్ణ కారులో వేగంగా వచ్చి వెనుకవైపు ఢీకొన్నాడు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బరామిరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 సిబ్బందికి ఫోన్ చేసి వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి



ఏఎస్ఐ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజకమల్, డిఎస్పి, ఎస్ఐలు

పెద్దమండ్యం/పెద్దతిప్పసముద్రం : విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న ఏఎస్ఐ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దతిప్పసముద్రం–ములకలచెరువు మార్గంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్‌ఓపల్లె తండాకు చెందిన మూడే రెడ్డెప్పనాయక్ తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లా సరిహద్దులోని చెన్నరాయునిపల్లె చెక్‌పోస్టుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో వస్తుండగా ప్రమాదానికి గురై కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న పెద్దతిప్పసముద్రం పోలీసులు, స్థానికులు 108లో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలిపారు. ఏఎస్ఐ మృతదేహాన్ని సోమవారం తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సిబ్బంది నివాళులర్పించారు. ఏఎస్ఐ కుటుంబ సభ్యులను అన్నమయ్యజిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పరామర్శించారు. జరిగిన సంఘటనపై మదనపల్లె డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐలు వెంకటశివకుమార్, చెన్నకేశవలు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఏఎస్ఐ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధు తెలిపారు.

ఎన్నికల బిజీలో ఖాకీలు. దర్జాగా దొంగల చోరీలు!

- తాళంవేసిన ఇళ్లే టార్గెట్
- ఖాకీలకు సవాల్‌గా మారిన చోరీలు



ఉస్మాన్‌నగర్‌లో ఓ ఇంటిలో చోరీ జరిగిన దృశ్యం

రాజంపేట : నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసుకుంటున్నారు. వరుసగా చోరీలు జరగడం ఖాకీలకు సవాల్‌గా మారింది. దొంగలు హల్‌చల్ చేస్తూ బీరువాలను పగులగొట్టి అందులోని నగదు, బంగారు దోచుకెళుతున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ఉస్మాన్‌నగర్‌లో ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి నగదు బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. పోలీసులు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా ఉండటంతో దొంగలు రాజంపేటను టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొరికిన కాడికి దోచుకెళ్లడంతో పట్టణవాసులు భయభ్రాంతులవుతున్నారు.

వరుస చోరీలిలా..

ఇటీవల రాజంపేట పట్టణం ఎర్రబల్లిలో నివాసం ఉంటున్న మైనార్టీ మహిళ ఇంటిలోకి దొంగలు చొరబడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అదే విధంగా పట్టణంలో చిన్న చిన్న దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహ సమీపంలో ఓ దుకాణం తాళాలను పగులగొట్టి అందినకాడికి ఎత్తుకెళ్లారు. మూడురోజుల క్రితం పట్టణంలోని బండ్రాలవీధిలో ఉన్న రెండు బంగారు దుకాణాల్లో రాత్రి సమయంలో చోరీలు జరిగాయి. వెండి, బంగారు నగలతోపాటు నగదు చోరీకి గురైంది. పది రోజుల క్రితం రాజంపేట మండలం బోయనపల్లెలో అద్దెగదుల్లో నివాసం ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించిన నాలుగు ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లారు.

గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

- లబ్ధిదారులు, గుడిసెవాసులు పరస్పరం దాడులు
- పలువురికి గాయాలు
- నిస్సహాయ స్థితిలో పోలీసులు



జగనన్న కాలనీలో మోహరించిన పోలీసులు

గోపవరం : మండలంలోని పి.పి.కుంట జగనన్న కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత నెలకొంది. జగనన్న కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు, గుడిసెవాసులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వివరాల్లోకి వెళితే బేతాయపల్లె సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీలో దాదాపు 78 మందికి పైగా పట్టాలు పొందారు. ఇప్పటికే 15 మందికి పట్టాలు మంజూరై ఇల్లు కూడా నిర్మించి ఇచ్చారు. కొత్తగా మంజూరైన మరో 78 మందికి జగనన్న కాలనీలో అధికారులు స్థలాలు చూపించాల్సి ఉంది. ఇచ్చిన పట్టాదారులందరికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అయితే వీరందరికి రెవెన్యూ అధికారులు స్థలాలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈలోపే సీపీఐ ఆధ్వర్యంలో స్థానికేతరుల ద్వారా జగనన్న కాలనీలో అక్రమంగా వందల సంఖ్యలో గుడిసెలు వేయించారు. ఈ ప్రక్రియ గత నెల రోజులుగా కొనసాగుతోంది. ఒక పక్క పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులు స్థలాలు చూపలేదని రెవెన్యూ అధికారుల వద్ద ఆందోళనకు దిగారు. మరో పక్క సీపీఐ ఆధ్వర్యంలో పేదలను రెచ్చగొట్టి స్థానికేతరుల ద్వారా గుడిసెలు వేయించారు. అక్రమంగా వేసిన గుడిసెలను తొలగిస్తే గాని లబ్ధిదారులకు స్థలాలు కేటాయించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పలుమార్లు బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే గుడిసెలు తొలగించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం పోలీసు బందోబస్తుతో తహసీల్దారు రోశయ్య జగనన్న కాలనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పట్టాలు పొందిన స్థానిక లబ్ధిదారులు కూడా కాలనీ వద్దకు చేరుకున్నారు. గుడిసెలు తొలగించాలని రెవెన్యూ అధికారులు, పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే ఇంతలో ఒక్కసారిగా లబ్ధిదారులు, గుడిసెవాసులు పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడిలో కొందరు గాయపడ్డారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన జేసీబీపై కూడా రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు వెనుకడుగు వేసి జేసీబీని వెనక్కు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై తహసీల్దారు రోశయ్య మాట్లాడుతూ జరిగిన విషయంపై ఆర్డీఓ వెంకటరమణకు నివేదిక అందజేస్తామని తెలిపారు.